వసంతరాజీయము

ఓగేటి ఇందిరాదేవి

"వసంత! ఏమిటో వాసనొస్తోంది - కూర మాడుతున్నట్లుంది, చూడు చూడు." స్నానంచేసి బాత్‌రూమ్‌లో నుంచి బయటికి వస్తూ అన్నాడు రాజు.

తల యెత్తకుండా వ్రాసుకుపోతోంది వసంత.

"వసంతా, నిన్నేనోయ్. వంటింట్లోకి వెళ్ళిచూడు;" మాడువాసన తారస్థాయి నందుకోగా వుండబట్టలేక మళ్ళీ హెచ్చరించాడు రాజు.

తలయెత్తి భర్తవంకోసారి చూసి "కథ పూర్తిగావస్తోంది. కాస్త మీ రెళ్ళి ఆ కూర దింపేద్దురూ," అనేసి మళ్ళీ వ్రాసుకోవటంలో మునిగిపోయింది వసంత.

రాజుకు ఏమనాలో తోచలేదు. గప్‌చిప్‌గా వెళ్ళి స్టౌ మీంచి కూరగిన్నె దింపేశాడు, ఏదో సామెత గుర్తు తెచ్చుకుంటూ.

ఆఫీసు టైమవుతోంది. కానీ వసంత అన్నంపెట్టే ప్రయత్నమేమీ చేసేట్లు లేదు. "కాస్త రెస్టు తీసుకుంటూండు వసంతా - మధ్య మధ్యలో," అంటూ వసంత ముందునుంచి వంటింటి గడప దాకా రెండుమూడుసార్లు పచార్లు చేసి వచ్చాడు రాజు. అమ్మాయి ఈ మాట వినిపించుకున్న లక్షణం గానీ అతని అవస్థను గమనించినట్లుగా గానీ కనిపించటంలేదు.

ఇక ఉపేక్ష చేస్తే లాభం లేదనుకుని "వసంతాదేవీ, ఈపూట కీ దీనుడికి భోజనప్రాప్తి లేదా?" అన్నాడు భార్య ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ. ఏకళ నుందోగాని తొందరగానే పలికింది దేవి: "ఆఫీసు వేళయినట్లుందిగదూ? కొంచెం మీరే పెట్టుకుని తినేద్దురూ. ఇదిగో ఇది ఫెయిర్ చేస్తున్నాను," అన్నది వ్రాత ఆపకుండానే.

నిర్ఘాంతపోయాడు రాజు.

'ఏమండీ, అన్నం తిందురుగాని రండీ. ఆఫీసుకి టైమయిపోతోంది,' అంటూ రోజూ బ్రతిమలాడే వసంతేనా ఇట్లా మాట్లాడేది? తనను బుజ్జగించి కొసరికొసరి తినిపించే వసంతేనా ఈ అమ్మాయి? ఔరా కాలమహిమ. ఐనా ఒకర్నని ఏం లాభం. స్వయంకృతం - కిక్కురు మనలేదు పాపం రాజు. బరువుగా అడుగు లేసుకుంటూ వెళుతున్న భర్తవంక చూసి దీర్ఘంగా నిట్టూర్చింది వసంత. బాధతో ఆమెహృదయం గిలగిల కొట్టుకుంది. అసలేం జరిగిందంటే...

* * *

వసంత బియ్యే చదువుతూ మానేసింది—మెత్తని హృదయం, మధురమైన రూపం ఇచ్చాడు దేవుడు. రాజు బీకాం ప్యాసై ఏదో ప్రైవేట్ కంపెనీలో

ఉద్యోగం చేస్తున్నాడు. ఉంగరాల జుత్తు వాడు! వూరించే కన్నులవాడు!

వసంతా రాజులది అన్యోన్యమైన దాంపత్యం_కానీ అట్లా వుంటే ఈ కథ వ్రాయాల్సిన అవసరమే లేకపోను_ ఎప్పట్నుంచో రాజు కో కోరికుంది_ తన భార్య రచయిత్రి కావాలని. పెళ్ళి చూపులప్పుడు వసంతను అడగనే అడిగాడు: "మీకు కథలు వ్రాయటమంటే ఇష్టమా?'' అని. అసలే సిగ్గుపడుతున్న వసంత తల ఊపేసింది. 'ఫర్వాలేదు' అనుకున్నాడు రాజు.

పెళ్ళైపోయింది. నవ దంపతులు కొత్తకాపరం పెట్టారు. అప్పట్నించీ వసంతని కథలు వ్రాయమని వత్తిడి చేయటం ప్రారంభించాడు రాజు. "నేనా? కథలు వ్రాయటమా?" అని ఆశ్చర్య పోయింది వసంత మొదట్లో_ "నువ్వే వసంతా! ప్రయత్నిస్తే వ్రాయలేకపోవు. లిటరేచర్ బియ్యే చదువుతూ మానేశావు _నువ్వే వ్రాయలేకపోతే ఎట్లా?



నువ్వు వ్రాయగలవు నాకు తెలుసు_" అంటూ రోజు కో ప్రోత్సాహపూర్వక మైన ఉపన్యాసం ఇచ్చేవాడు రాజు.

భర్తను ఆ ఉద్దేశంనుంచి మార్చాలని శాయశక్తులా పాటుపడింది వసంత_ నిద్రమంచం మీదినించే "వసంతా! ఇవ్వాళ తప్పకుండా కథ..." అంటూ మొదలెట్టేవాడు రాజు.

వసంత హడావిడిగా వచ్చేసి "ఏమండోయ్! ఆ మధ్య నేను గులాబీ మొక్క నాటాను గుర్తుందీ? ఇవ్వాళ అది ఇంచక్కటి పువ్వు పూసింది. చూపిస్తాను రండి," అంటూ లాక్కెళ్ళేది. ఇంకేముంది! రాజు కథ మాట మర్చిపోయి గులాబీ పువ్వుకూ ప్రాణేశ్వరి (అంటే వసంత) చెక్కిళ్ళకూ గల సామ్యం గురించి ఉపన్యసించేవాడు కాస్సేపు.

ముసిముసినవ్వులు నవ్వుతూ కాఫీ అందించేది వసంత. భోజనం చేస్తూ, "వసంతా! మరేఁ కథ..." అంటూండగానే వినిపించుకోకుండా, ఇంకొంచెం కూర వెయ్యనా? ఈ కూర మీ కిష్టమని ఎంతో బాగా చేశాను. బావుందా? మరైతే అంత కూరేనా ఎవిఁటమ్మా వేయించుకుంటారూ? ఇంకొంచెం వేస్తాను." అంటూ మొదలెడుతుంది వసంత. ఇక రాజుకు కథమాట గుర్తుంటుందీ? అమ్మాయి పమిటచెంగు సందుకునే వ్యాపకం తప్ప మరేదీ తట్టదు అతగాడికి అప్పుడు.

"ఛా! ఏమిటదీ? పసిపిల్లల్లాగా. మీకింత అల్లరి తగదసలు," అంటూ అందంగా కోప్పడేది వసంత.

"ఎబ్బెబ్బె! నా దేం తప్పు లేదు. నీ కొంగుదే తప్పంతా. విసురుగ్గా వచ్చి నా చేతిలో యిరుక్కుంది. నువ్వేమో నిర్దోషినైన నామీద దోషారోపణ చేస్తున్నావు." అంటూ ఊఁ ఇదై పోయేవాడు రాజు.

సాయంత్రం పువ్వులూ, స్వీట్సూ తీసుకుని హుషారుగా యింటి కొచ్చేవాడు రాజు.

అందంగా తయారై వేయికళ్ళతో ఎదురు చూస్తూండేది వసంత. భర్తకు ఎదురువెళ్ళి చిరునవ్వులు కానుక లిస్తూ, "ఏమండీ! ఇవ్వాళ మీకోసం ఏంచేశానో చెప్పుకోండీ?" అంటూ అతనీ బూట్లు విప్పేది_"నేను నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో మరి చూద్దాం." అంటూ వూరించేవాడు రాజు_తెచ్చిన పువ్వుల మాల తలలో అలంకరిస్తూ, "వసంతా! వసూ! డియర్! నువ్వు మంచిదానివిట. అపరంజి బొమ్మవిట; కథ వ్రాస్తావుట," అనేవాడు లాలనగా రాజు. "అదా సంగతి: ఇవ్వన్నీ కథ వ్రాయించుకోవటానికి దోహదక్రియలాండీ? నా మీద నిజంగానే అపేక్ష వుండి పట్టుకొచ్చారేమో నమకున్నాను," అని ముద్దుగా మూతి ముడుచుకుండేది వసంత.



అమ్మాయి అందానికి కరిగి కరిగి నీరైపోయేవాడు రాజశేఖర్. అంటే రాజు – అతని ఠీవిని చూసో ఏమోగాని అందరూ అతన్ని 'రాజు' అనే పిలుస్తారు.

"ఎంత మాటన్నావ్! ఏదీ ఒక్క కోరిక కోరుకో! తక్షణం దాన్ని తీర్చేసి నా ఆపేక్షనీ, నా పత్నీభక్తిని నిరూపించుకుంటాను." అని ఓ గంభీరమైన పోజు పెట్టేసేవాడు రాజు.

"మరైతే సినిమాకి వెళదామండీ!" గోముగా అడిగేది వసంత. కాస్సేపటి కల్లా వాళ్ళు చిలకా గోరింకలకే వంకలు పెట్టేటంత అందంగా, అనురాగంగా, వాత్సల్యంగా చెట్టాపట్టా లేసుకుని పక్కింటి, ఎదురింటి పడతుల కళ్ళు అసూయతో కుంచించుకుపోతుండగా సినిమా కెళ్ళిపోయేవాళ్ళు. మర్నాడు పార్కుకి, ఆ మర్నాడు పిక్నిక్కి ఆ మర్నాడు ఫ్రెండింటికి ఇట్లా తిప్పేది వసంత రాజును.

ఇట్లా బుజ్జిపాపాయిని మరిపించినట్లు తన రాజునుకూడా ఒక్క ఆరు నెలలు మరిపించింది వసంత. తన చాకచక్యమూ, తన అమోఘమైన ప్రేమా, ఇట్లా వేస్టయిపోవడం ఆ అమ్మాయి కేం నచ్చలేదు. రాజేమో కథలు వ్రాయమనే పోరు మానలేదు. ఒక రోజు తెగేసి చెప్పా డతడు: "నువ్వు కథ వ్రాస్తేనే సాయంత్రం నీ తల్లో పువ్వులు పెడతాను. లేకపోతే నువ్వే పెట్టుకోవలసి వుంటుంది." అని. "కథ వ్రాయకపోతే నీ చేత్తో కాచిన కాఫీ నే త్రాగ,"నన్నాడు. ఆనక విసురుగ్గా ఆఫీసు కెళ్ళిపోయాడు.

ఈ దెబ్బతో పూర్తిగా బెంబేలుపడి పోయింది వసంత. మరీ ఇంత పెద్ద శిక్ష! ఎంత ఇదైతేమాత్రం! ఆయన మటుకు ఎంత కోపం రాకపోతే ఇట్లా అంటారు. నేను కథలు వ్రాయాలని ఎంతగా ఉబలాట పడ్డారో పాపం. భారతనారీ ధర్మం ప్రకారం ఆయన కోరిక తీర్చటానికి అశక్తురాలై పోయాను నేను. భగవంతుడా! నాకు కథలు వ్రాయటమైనా వచ్చేట్లు చెయ్యి. లేదా ఆయనకీ కథల పిచ్చైనా వది లించు — వేంకటేశ్వరస్వామీ! రేపు శనివారం రెండు కొబ్బరికాయలు కొడ తాను. నా కాపరం పాడుచెయ్యకు," అని తెగ బాధపడిపోతూ వేడుకుంది వసంత.

ఇంతలో "వసంతా! ఏం చేస్తున్నావ్? మీ శ్రీవారు ఆఫీసుకు వెంచేసినారా?'' అంటూ ఉత్సాహంగా లోపలికి ప్రవేశిం చిన జానకి విస్తుపోయి నుంచుంది రెండు క్షణాలపాటు. అందుకు కారణం ఒకటి కాదు చాలా ఉన్నై. వసంత చెక్కిట చెయ్యి, కంట నీరూ, ఎదురుగుండా కాయితాలూ కలమూ కారణాలు. జానకీ వసంత ప్రాణ స్నేహితురాలు. హైస్కూలు టీచరు.

జానకిని చూడగానే వసంత దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది. "అయ్యయ్యో ఏమైంది వసూ! మీరాజు గారు చాలా చాలా మంచివారుగదా! నీ సుఖం చూసి అసూయపడిపోయి ఏ దేవతలో గంధర్వులో శాపం పెట్టెయ్యి లేదుగదా!" ఆపేక్షతో ఓదారుస్తూ అడిగింది జానకి.

సిగ్గుపడుతూనే జరిగిన సంగతి చెప్పింది వసంత. "ఓశ్! ఇంతేనా! వసూ. నువ్వు నాటకాల్లో వేశావుగదూ," అంటూ ఉత్సాహంగా అడిగింది జానకి.

కథలు వ్రాయనిడాకీ, నాటకాల్లోవేషం వేయడానికీ ఏం సంబంధమో అస్సలు అర్థం కాలేదు వసంతకి. అయినా జానకి అనవసరంగా అడగదులే అనుకుంది. "ఔను బెస్ట్ యాక్టర్‌గా కాలేజీలో రెండు సార్లు ప్రైజు లొచ్చెనే, గుర్తులేదూ?" కళ్ళు తుడుచుకుంటూ అన్నది వసంత.

"మరింకేం నేను చెప్పినట్లు చెయ్యి." అంటూ ఆ విధానమంతా బోధించింది జానకి.

"అమ్మయ్యో! నే నట్లా చెయ్య లేను జానకీ! పాపం ఆయన..." భయంగా — జాలిగా అన్నది వసంత.

"పాపం ఆయన...ఏం—ఏమైపోతా డమ్మా నీ ప్రాణేశ్వరుడు ఈ రెండ్రో జుల్లో? నువ్వింత మంచిదానివి గనకే ఆ రాజుగారి ఆటలు సాగుతున్నై,'' అంటూ ఘాటుగా కోప్పడింది జానకి.

"మరి కథ ఏదని అడిగితే," అను మానంగా చూసింది వసంత.

"కథా! నువ్విట్లా చేశావంటే ఓ నాల్గురోజులు — కథమాట దేవుడెరుగు — కలమే పట్టడిక మీ ఆయన. ఈ లోపల 'అదుగో, ఇదుగో'

అని తప్పించుకోలేవూ - పెద్ద వసంతా విధేయుడికి అర్ధాంగివై యుండి?" వేళా కోళంగా అడిగింది జానకి.

"నువ్వేం వెక్కిరించక్కర్లేదు. నువ్వే చూద్దుగానిగా," అని సవాల్ చేసింది వసంత.

"నీ సామర్థ్యం గూర్చి ఇక నాకేం అనుమానం లేదు. ఇంత మంచి సలహా చెప్పినందుకు నా కో కోరిక తీర్చాలే వసూ నువ్వు," అన్నది జానకి వసంత శరీర స్థితిని గమనిస్తూ, సన్నగా నవ్వుతూ.

పాపం వసంత అమాయకురాలు. "అంతకంటేనా-ఆయన కీ కథల పిచ్చి వదలాలే గాని-నీ కోరిక తీర్చలేననుకున్నావా? నీ పథకం గనక వక్రించిందో నీకు మొట్టికాయే ప్రెజెంటేషను," అంటూ కిలకిల నవ్వింది.

"ఏం లేదూ-నాకు నీ వియ్యపురాల్ని



కావాలని వుంది," అన్నది జానకి. ఎందు కనో గాని వసంత ఆగకుండా సిగ్గు పడి పోయింది. కాస్సేపు కబుర్లు చెప్పి ఇంటి కెళ్ళిపోయింది వసంత వియ్యపురాలు జానకి.

*　　　*　　　*

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చాడు రాజు. వాసును చూడకుండా ఇన్ని గంటలు గడపడమంటే అతనికి చాలా బాధగానే ఉంది. కాని తప్పదు మరి. "పాపం – ఎంత ఇదై పోతోందో వసు నా కోసం?" అనుకుంటూ ఇంటి కొచ్చేసరికి వసంత అపరశారదాదేవి లాగా కనిపించింది – చుట్టూ తెల్లకాయి తాలూ, పక్కన రెండు పెన్నులూ, అల్లంతదూరాన కాఫీ వుంచుకున్న ఫ్లాస్కూ; అప్పు డప్పుడూ ఆనుకోవ టానికి వీలుగా ఒక దిండూ–నుదుట అల సటను సూచిస్తూ చిరుచెమటలు–వగైరా వగైరా సరంజామాను చూసి ఎంత ఆశ్చర్యపోవాలో అంత ఆశ్చర్య పోయాడు. కథ వ్రాస్తోంది వసంత – నిజంగా కథే వ్రాస్తోంది. లేని పక్షాన పెన్ను ముట్టుకోవడమంటేనే అదో రకం చికాకు గదా ఆ అమ్మాయికి. 'కలా? నిజమా?' అని, కళ్ళు నులుముకుని చూసి మరీ ఆశ్చర్యపోయాడు రాజు. "వసూ! వసంతా!" అన్నాడు దగ్గిరికి వెళ్ళి. అతని గొంతులో అనురాగమన్న మాట జీవం పోసుకుని నర్తించింది.

ఆ పిలవబడిన అమ్మాయి పలకలేదు సరిగదా తొణకలేదు బెణకలేదు – కదల నేనా కదలలేదు. ఆమె కలం గబగబా నడిచిపోతున్నది. రాజు అనురాగానికి ఈ ఆరునెలల్లోనూ ఇంత దెబ్బ ఎప్పుడూ తగల్లేదు. కొంచెం సేపటికి తెప్పరిల్లు కొని "నా మీద కోప మొచ్చినట్లుందే దేవిగారికి. అయినా కోపంగా వున్నప్పుడే నువ్వెక్కువ బాగున్నావ్ వసూ! కథేనా వ్రాస్తున్నావు? నాకు తెలుసు. నువ్వు బుద్ధిమంతురాలివని – ఇదుగో చూడు ఈ పూలమాలంతా నీకే," అంటూ ఆమె జడను సమీపించాడు. ఉలికిపడి గభాల్న జడ ముందరికేసుకుంది వసంత..తర్వాత తల్లోని పువ్వుల్ని తడుముకుంది.

"ఏమిటల్లా వులిక్కిపడ్డావ్ వసూ? ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు.

"ఓ–మీరేనా? ఎవరో తలపట్టుకున్న ట్లుందే నూ ఉలిక్కిపడ్డాను. ఎంత సే పైంది ఇంతకీ మీ రొచ్చి," అన్నది వసంత నల్లని కలాన్ని పచ్చని చెక్కి లిపై ఆనించుకుంటూ.

తెల్లని జరీచీర కట్టుకుని, బుగ్గమీద పెన్నుంచుకుని, మల్లెపూలు పెట్టుకున్న పొడుగాటి జడను ముందరికేసుకుని, కాటుకకళ్ళను సుకుమారంగా చిట్లించి చూస్తున్న వసంతను కన్నార్పకుండా చూశాడు రాజు. ముగ్ధుడైపోయాడు– 'రోజూ చూసే వసంత ఈ అమ్మాయి కాదా?' అన్న అనుమానమూ కలిగింది.



ముందు కెమేరాకోసం పరిగెత్తాలో లేక పోతే 'ఏదేది_ నీ బుగ్గమీద అంటినట్లుంది సిరా. అరెరె! తుడవనా?' అంటూ అమ్మాయిని దగ్గరకు లాక్కో_వాలో తెలీ లేదు అతనికి.

ఈ సాత్విక భావాల గొడవేం పట్టి నట్లు లేదు వసంతకి. గబగబా వ్రాసుకు పోవటం మొదలెట్టింది. మళ్ళీ దిగ్భ్రాం తుడై పోయాడు రాజు_కాళ్ళకున్న బూట్లు అతనివంక జాలిగా చూశాయి, మా గతేవిఁటన్నట్లు. తన సంగతి అట్లా వుంచి యజమాని దురవస్థ గురించి టెర్లిన్ షర్టు ఉస్సురుమన్నది. అసలే చెరిగిపోయిన క్రాఫ్ మరోసారి చెదిరి, బాధపడింది. చేతివాచీ నిశ్శబ్దంగా నిట్టూ ర్చింది. సదరు వస్తువులవంక నిస్పృహా యంగా, జాలిగా చూశాడు రాజు. మరో మూల హృదయం గోల పెడుతున్నది. ఇంతెందుకు ప్రకృతే మూగవోయింది.

పాపం రాజు ఏంచేస్తాడు మరి. తనే బూట్లు విప్పుకున్నాడు. 'వసంత కథ వ్రాస్తోంది. నిస్సంశయంగా కథే_గొప్ప కోరికలు నెరవేరాలంటే ఇట్లాంటి చిన్న చిన్న కష్టాలు పడందే లాభంలేదు_'కష్టే ఫలే' అన్నారు పెద్దవాళ్ళు. అలా టెర్లిన్ షర్టూ వగైరాలకు కూడా చెప్పి నచ్చ జెప్పి ఓదార్చాడు. పడకకుర్చీలో జార్ల బడి వసంతని చూస్తూ కూర్చున్నాడు. అంతర్వాణి 'ఆకలో' అని గోలపెడు తున్నా లెక్క_చేయటంలేదు.

ఓరకంట భర్త అవస్థని గమనిస్తున్న వసంత ఇక వూరుకోలేకపోయింది. "అన్నం పెడతాను రండి. గబగబా తినేద్దురుగాని. నేను తొందరగా వచ్చి కథ

వ్రాసుకోవాలి. మంచి రసపట్టులో వది లేసి వచ్చాను," అన్నది లేచివెళ్ళి అతని ఉంగరాల జుట్టును సరిచేస్తూ.

పూలపొట్లం లాంటి ఆ చెయ్యినీ - చెయ్యినేకాదు దాని తాలూకు మనిషినీ దగ్గరకు లాక్కుని గాఢంగా ముద్దులాడా లనే కోరిక పరవళ్లు తొక్కింది రాజు మనస్సులో. బలవంతాన అణచుకుని, 'పద' అంటూ వంటింట్లోకి నడిచాడు పాపం రాజు. వసంత అతను ఎంత కావాలంటే అంతే వడ్డించింది. అందు కనే అర్ధాకలితో లేచాడు.

పదకొండు గంటలదాకా వసంత చేతిలో పెన్ను చకచక సాగిపోతూనే ఉన్నది-సత్యభామ చేతిలో బాణంలాగా.

తొమ్మిదిముప్పావునుంచీ పక్కమీద పడుకుని ఎదురుచూస్తున్నాడు రాజు. ఇందాకట్నుంచీ చేసిన దారుణానికి భార్య చెప్పుకోబోయే సమాధానంకోసం. అమ్మాయి పెద్దపెద్ద కళ్ళు అల్లల్లార్చి జాలిగా తనవంక చూసినప్పుడు, 'ఊఁహూఁ, లొంగిపోకూడదు,' అని మనసుకి మరోసారి హెచ్చరిక చేసుకుంటూ పడుకున్నాడు-కానీ తన గురించి వసంత ఈషణ్మాత్రమైనా ఆదుర్దా పడుతున్నట్లు కనిపించటల్లేదు.

గడియారం, పదకొండు గంటలు కొట్టింది. గభిక్కున మంచంమీంచి లేచి, "వసంతా! నువ్వు వ్రాసేది నవలా?" అని వ్యంగ్యం స్ఫురించేట్లు అన్నాడు రాజు.

"అంతా అయ్యాక మీకు చూపిస్తాగా! ఈలోప అంతా సస్పెన్సన్న మాట. నిద్ర వస్తోందండీ-కానీ మూడ్ కుదిరినప్పుడు వ్రాయకపోతే ఎట్లా? అందుకే ఇన్నాళ్ళనుంచీ వ్రాయలేదు," అన్నది వసంత వ్రాసుకుంటూనే.

భార్యమీద ప్రేమ పొంగి పొర్లుకు వచ్చింది రాజుకు. "అమ్మ దొంగా! ఇన్నాళ్ళబట్టీ నన్ను మభ్యపెట్టావుగదూ వ్రాయటం రాదని? ఎంత నాటకం ఆడావు! వసూ! త్వరగా పడుకోమరి. నీ ఆరోగ్యం ముఖ్యం," అంటూ నిద్రపోయాడు రాజు. మృదువుగా తట్టి, తనని లేపి, మొహం కడుక్కోటానికి నీళ్ళివ్వియిచ్చి-తర్వాత వేడివేడి కాఫీకప్పుతో ప్రత్యక్షమౌతుంది వసంత రేపొద్దున్న కూడా - రోజూలాగే అనుకుంటూ. కానీ అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే ఇహ లేని దేముందీ!

దాదాపు ఏడుగంటలకి లోపలికి చొచ్చుకుని వచ్చిన సూర్యకిరణాలు నిద్ర లేపాయి రాజుని - "అరె చాలా ప్రొద్దెక్కిందే, వసంతా! నన్ను లేపలేదేం!" అని ప్రశ్నిస్తూ ఇవతలికి వచ్చాడు రాజు. ఆ గదిలో వసంత కూర్చుని వ్రాసుకుంటున్నది. నిన్నటి విషయ మంతా గుర్తొచ్చిం దిప్పుడు. 'అమ్మయ్యో! వసంత కాఫీ కాచినట్లు లేదే - ఇక



హోటలు కాఫీయే శరణ్యమా?' అని కొంచెం భయంవేసిం దతనికి.

తలెత్తి, "నిద్ర లేచారా? ముఖం కడుక్కుని, అదుగో, ఫ్లాస్కులో కాఫీ ఉంచాను తాగండి—నే తాగేశా లెండి," అన్నది వసంత.

ఇంత అక్రమం ఎక్కడన్నా వుంటుందీ? ఎట్లాంటి వసంత ఎట్లా మారిపోయిందీ? అయినా ఒహర్నని ఏం లాభం? గప్‌చిప్‌గా వెళ్ళి కాఫీ తాగేశాడు రాజు.

ఉడికీఉడకకముందే అన్నం దించేసి, గబగబా కూరముక్కలు తరిగిపడేసి మళ్ళీ వ్రాసుకుంటున్నది వసంత. "కూర మాడుతోంది వసంతా!" అంటే ఏదో సామెత చెప్పినట్లు, "కాస్త మీరే దింపెయ్యండి," అన్నది. "అన్నం మీరే పెట్టుకు తినండి," అన్నది.

ఇదీ జరిగిన సంగతి.

* * *

రెండురోజు లిట్లా జరిగేసరికి రాజు డీలాపడిపోయాడు. అతగాడి రూపురేఖా విలాసాలు మారిపోయాయి. 'ఈ కథలు వ్రాస్తూ వసంత నాకు దూరమైపోతోంది, ఏం చెయ్యటం? ఆరునెలలనించీ వ్రాయమని వేపుకు తిని, ఇప్పుడు మానెయ్యమంటే ఎట్లా—మీ రింత ఖార్యాలోలురేం మరీనూ!— అని నవ్వదూ వసంత. నవ్వితే నవ్విందిగాని మానేస్తుం దని హామీ ఏమిటి?' ఇట్లా ఆలోచించుకుంటూ చిక్కిపోతున్నాడు రాజు — చెక్కిళ్ళలో మరీను.

రెండున్నర రోజులు జానకి చెప్పినట్లే చేసింది. కానీ ఇక అట్లా చేయటానికి అసాధ్యమైపోయింది వసంతకి – 'బాబోయ్! ఇక నా వల్లకాదు. ఇప్పుడు చేసినదానికే నిష్కృతి యేమిటో? ఆయన్నే అడిగితే, అమ్మో!' అని నానాహైరానా పడిపోతోంది వసంత ఇంటిదగ్గిర.

* * *

రాజు స్నేహితులందరూ "ఇదేమిటోయ్ ఇట్లా అయిపోయావ్? ఏమిటి సంగతి? మొన్నటివరకూ దేవేంద్రుడిలా వుండేవాడివిగదా?" అని ప్రశ్నించారు.

"మీ ధర్మపత్ని సతీ అనసూయావాళ్ళ కోవకి చెందుతుందని విన్నానే." అని పరామర్శించాడు ఎదురింటి ఆచార్లు. రాజూ వసంతల అన్యోన్య దాంపత్యానికి ఈర్ష్యపడేవాళ్ళల్లో ఒకడేమో మరి. ఏదో సమాధానం చెప్పి తప్పించుకున్నాడు రాజు.

ఆర్. పి. హోమ్, సీ. హెచ్. ఎల్. అనే ఇద్దరు ఆప్తమిత్రులకు మాత్రం తన సంగతి నివేదించక తప్పలేదు రాజుకి.

సీ. హెచ్. ఎల్. అంటే చింతల పాటి సీతారామాంజనేయులుకి అనుమానం వచ్చింది. "రాజా! మీ ఆవిడ వ్రాసిన కథని నువ్వు చూశావా? కనీసం ఒక్క కథనైనా?" అన్నాడు సిగరెట్ వెలిగించి పొగలు ఆకాశంలోకి వదుల్తూ, పెద్ద డిటెక్టివ్ పోజులో.

"ఊఁహూఁ – వ్రాసిన కాయితాలన్నీ పెట్లో పెట్టి తాళంవేసుకుని ఆతాళంచెవిని మంగళసూత్రాలకు కట్టుకుంటోందోయ్;" బాధగా అన్నాడు రాజు.

"అదీ అట్లాచెప్పు–కథలువ్రాయమని మీ ఆవిణ్ణి బెదిరించిన రోజు మీ యింటికెవరైనా వచ్చారా – అంటే ఆవిడ అన్నలుగాని వదినలుగాని." ఆలోచనాపూర్వకంగా ప్రశ్నించాడు సీ. హెచ్. ఎల్.

"ఇది హత్యానేరమో, దొంగతనమో కాదోయ్ చిట్టితండ్రీ!" అని కోప్పడ్డాడు ఆర్. పి. హోమ్. "రాజా! నే చెప్పినమాట విను. ఇంటికెళ్ళి తొందర తొందరగా బట్టలు సర్దేసుకుని సూట్‌కేసులో పెట్టేసుకుని రెండునెల్లదాకా రానని చెప్పి చరచరా వీధిలోకి వచ్చేయవోయ్," అన్నాడు ఆర్. పి. హోమ్. అనగా రెంటాల వరంధామ్.

"ఏడిసినట్లుంది నీసలహా. ఆవిడ డింకా· పెన్ను టకటకలాడించుకుంటూ నే 'మంచిది, వెళ్ళిరండి. మరో నాలుగు నెలలుండి మరీరండి,' అంటే ఏం చేస్తావ్? వీణ్ణి నీ యింట్లో వుంచుకుంటావా?" అన్నాడు సీ. హెచ్. ఎల్. రాజుని ఉద్ధరిస్తున్న ధోరణిలో. ఎట్లాగైతేనేం ఒక నిశ్చయానికి వచ్చినతరువాత ఆ ముగ్గురు మిత్రుల సమావేశం ముగిసింది.

* * *

ఆ సాయంకాలం_

మబ్బురంగు ఫుల్ వాయిల్ చీర అక్కడక్కడా మామిడిపిందెల డిజైన్ ఉన్నది కట్టుకుని, మామిడి పిందె ఆకారంలో బొట్టు పెట్టుకుని తదియ చంద్రుడి లాంటి పెదవులతో సన్నగా నవ్వుతూ తన రాజుకోసం ఎదురుచూస్తూ నుంచుంది వసంత.

చాలా సీరియస్ పోజులో ఇంటి కెళ్ళిన రాజుకు మళ్ళీ ఇలాంటి స్థితిలో వసంతను చూడగానే షాక్ తగిలినట్లై పోయింది. కాదూ మరి. ఇంకో ఇంకో సందర్భంలో అయితే 'కలయో వైష్ణవ మాయయో' అని కావ్య పరిభాషలో కాస్సేపు భార్యామణిని ఏడిపించేవాడే. కానీ నేడు కార్యాంతర వ్యగ్రుడై వుండె_ అందుకని వసంత నోసారి ఓరకంట చూసేసి లోపలికి వెళ్ళి గబగబా బట్టలు సర్దేసుకోవడం మొదలెట్టాడు. వసంత గాఢంగా ఆశ్చర్యపోయింది. ఎట్టకేలకు పాపమా తరుణి తమాయించుకుని లోపలికి వెళ్ళి "నేను సర్దుతాలెండి. మీరు సర్దుకుంటే అయినట్లే ఇక. మీ బట్టలకు బదులు నా చీరలే పట్టుకుపోగల్రు. ఇంతకీ వూరికేమైనా వెళ్తున్నారా?" అన్నది ధైర్యం చేసి.

అమ్మాయి మాటలు వినుపించుకోకుండా ఇంకా ఏమిటో వెతుకుతున్నాడు రాజు, భావోద్వేగానికి ఆనకట్టలు కట్టుకుంటూ. "ఏమిటండీ మాట్లాడరూ?" కొంచెం దుఃఖం మిళితమైన గొంతుతో అన్నది వసంత, తనను తానే సంబాళించుకుంటూ.

మరో నాలుగు నిముషాలకు తలకాయి యెత్తి "వసంతా! నేను ఆఫీసుపనిమీద వూరికెళ్తున్నాను. రెండు నెలలదాకా రాను బహుశా," అన్నాడు సూట్ కేస్‌కు తాళం వేస్తూ.

ఇది తన నిర్లక్ష్యానికి శిక్షే అనుకుంది వసంత. వసంతకు భోర్న ఏడుపొచ్చింది. రాజులోని అనురాగస్రవంతి ఉబికిపోయింది. "వసూ! వసంతా! ఏమిటి పిచ్చిపిల్లవాయేం? ఏడ్చేస్తున్నావేమిటి? ఛా ఛా ఛా– నీకు తాయిలం పెట్టనా? ఊరుకోమరీ" ఇన్నాళ్ళి ఆపేక్ష పొంగి పొరలగా భార్యను దగ్గరకు తీసుకుని ఆమె కన్నీళ్ళు తుడిచాడు– తుడిచినకొద్దీ ఆమె కన్నీళ్ళు ఎక్కువై పోతున్నై– అరెరె! ఎట్లా ఇప్పుడు? ఓదార్చటం రాక ఖంగారుపడిపోయాడు రాజు. కలకంఠి కంట కన్నీరొలకడం సంగతి కాపురం పెట్టిన ఆరునెలల తరువాతగాని తెలిసిరాలేదు మరి!!

కాస్సేపటికి వసంతే కన్నీరు తుడుచుకుని "ఈ రెండు నెలలూ నన్నేమై పొమ్మన్నారు? కాస్త చెప్పివెళ్ళండి. నిజంగా ఆఫీసు పనేనా? ఇదివర కెప్పుడూ లేనిది ఇప్పు డేం వచ్చిందీ? మీ రేమో ఇట్లా చిక్కిపోయారు. హోటల్లో తిండే మీకు పడదు. ఇం కెలా అయిపోతారో!" అన్నది. మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది.

"ఆఁ......నేను చిక్కిపోతే ఎవరిక్కావాల్లే– నా చేత్తో నేనే వడ్డించుకు తినటంకన్నా ఆ హోటలువాడు వడ్డిస్తే నన్నా కాస్త సయిస్తుందేమో;" నిర్లిప్తతగా–నిర్వేదంగా అన్నాడు రాజు.

అందులోని వ్యంగ్యానికి వసంత హృదయం మండిపోయింది.

"ఇంత ఉపేక్షచేస్తున్నా రేమిటండీ! నేను మీ వసంతను కదా – మిమ్మల్ని చూస్తే నాకు దిగులుగా వుంది," అన్నది భయపడిపోతూ వసంత.

"ఇంకా నయం. ఉపేక్ష చేస్తున్నది నువ్వా నేనా? నువ్వేళ్ళ రాణీ! వెళ్ళి కథలు వ్రాసుకో–అయ్యో! ఇంత టైం వేస్టు చేశావేం – ఎట్లా? అన్నట్లు ఈ రెణ్ణెల్లల్లోనూ బోలెడన్ని కథలు వ్రాసుకోవచ్చు–మధ్య మధ్య నా డిస్టర్బెన్సుండదు హాయిగా," అన్నాడు రాజు.

వసంత ప్రాణం విలవిలలాడిపోయింది – "నన్ను క్షమించరూ?" అంటూ పాదాలమీద వాలిపోతున్న భార్యను లేవదీశాడు రాజు. ఏం? ఎందుకని? నువ్వేం తప్పు చేశావు గనక–" అన్నాడు.

"ఏం తప్పు చేశానో నాకూ తెలుసు, మీకూ తెలుసు. కారణాంతరాలవల్ల అట్లా చేశాను–అబ్బ! ఏం కథలండీ బాబూ! చచ్చిపోయాను వ్రాయలేక. చెయ్యి నొప్పెడుతోంది," అంటున్న వసంతని చూస్తే అమితమైన జాలి



పుట్టుకొచ్చింది రాజుకి. కథలూ వద్దు కాకరకాయలూ వద్దుగాని పూర్వంలా వుండు వసూ! నా కదే పదివేలు. అసలిదేమిటి నువ్వు? నువ్వు కూడా ఇట్లా అయిపోయావు. నీ చెక్కిళ్ళిట్లా తెల్లబడిపోయాయేం?'' ప్రేమగా ఆమె మొహాన్ని పరామర్శిస్తూ ఆవేదన నిండిన కంఠంతో అన్నాడు రాజు.

వసంత చిరుసిగ్గును దాచుకుంటూ "అదేమిటో తెలుస్తుంది లెండి'' అంటూ పారిపోయింది. రాజు ఆశ్చర్యంగా చూస్తూనుంచున్నాడు.

''ఇదిగో! నేను వ్రాసిన కథ–చూపిస్తానన్నాగా – సరసహృదయులూ, సహృదయులూ అయిన భర్తగారికి అంకితమిస్తూ నిజంగానే ఓ కథ వ్రాస్తాను చూస్తుండండి–ఇప్పుడు మాత్రం నన్నేం అనకండి ప్లీజ్,'' అన్నది నీళ్ళతో మెరిసే కళ్ళతో నవ్వుతూ–ఒక కాయితాలకట్ట అతని చేతిలో పెట్టింది.

ఆత్రుతగా వాటిని చూశాడు రాజు. "ఇదేమిటి! అమ్మ దొంగా; రామకోటి వ్రాశావా? రామకోటి. చిట్టీ! ఇన్నాళ్ళూ రాత్రీ పగలూ కూర్చుని బరబరా వ్రాసేసింది ఈ రామకోటినా? అబ్బ! ఎంత ఏడిపించావ్ నన్ను." వసంత చెక్కిళ్ళను ఊపిరాడనీయలేదు రాజు.

అతి ప్రయత్నం మీద విడిపించుకుని

"ఏమండీ! మీ ప్రయాణం ఇంకో మూణ్ణెల్ల తరువాత వచ్చేట్లు చూడకూడదూ? అప్పుడు నేను మా పుట్టింటి కెళ్ళాలిగా మరి," అంది వసంత యాదాలాపంగా.

"నా ప్రయాణమా? అదీ నీ రామకోటి లాంటిదే. నువ్వు పుట్టింటి వెళతావా? నిజమా? అర్ధమైపోయిందిలే వసంతా! అరె, ఇటుచూపమంటూంటే;" రాజు చేతుల్లోంచి తప్పించుకుని పారిపోయింది రామకోటి రచయిత్రి వసంత.

మళ్ళి కాస్సేపటికి "ప్రయాణం అబద్ధం ప్రసాదం నిబద్ధం అన్నారు పెద్దలు. ఇవిగో కొబ్బరి ముక్కలు పట్టండి. ఇవ్వాళ శనివారంగా. మీ కీ కథల పిచ్చి వదిలిస్తే కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నాను లెండి," అంటూ పళ్ళెంలో కొబ్బరి ముక్కలతో సహా ప్రత్యక్షమైంది వసంత.